ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 17 | సంచిక : 05 | జనవరి 2012

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

తణుకు ........... 13-11-2011

మురమళ్ళ ....... 20-11-2011

గొరగనమూడి . 25-11-2011

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## భగవాన్ శ్రీ రమణ మహర్షి

ప్రతి సంవత్సరం మాదిరిగానే ది॥ 09-01-2012న పరమ గురువు భగవాన్ శ్రీ రమణమహర్షి జయంతి జరుపుకోబోతున్నాం! ఆయా కాలానికి తగినట్లుగా మహాత్ములు దేహం ధరించి జీవకోటిని అంతిమ సత్యంలోనికి మేల్కొలుపుతూనే ఉంటారు. అట్టి కారణజన్ముడే అరుణాచల ఋషి, భగవాన్ శ్రీ రమణమహర్షి. ది॥ 30-12-1879న తిరుచ్చుళిలో దేహం ధరించి తన 17వ సంవత్సరంలో మధురైలో ఉండగా ఆధ్యాత్మిక మహోన్నత శిఖరాన్ని అందుకొన్నారు. పిమ్మట ది॥ 01-09-1896న 'జ్ఞానబోధ' నిమిత్తం ఆ ఉపాధి అరుణాచలం చేర్చబడింది. అప్పటి నుండి ఆ స్ఫూర్తిని, అఖండ జ్ఞానాన్ని నిరంతరంగా ప్రసరిస్తూనే ఉన్నారు. నేనెవరు? అన్న విచారణామార్గాన్ని సూటిగా, తేలికగా బోధించడానికి వచ్చిన గురుమూర్తి శ్రీ రమణమహర్షి. సకల జీవులలో 'నేను-నేను' అని స్ఫురించే ఎరుకయే భగవాన్ శ్రీ రమణులు. నేనెవరు? అన్న ప్రశ్నకు తానే సమాధానంగా నిలిచారు. మౌనానికి భాష్యం, జ్ఞానానికి వాగ్రూపం భగవాన్ శ్రీ రమణమహర్షి. నేటి కాలంలో ఆత్మ సంయమనం కరువై, నిరాశ, అశాంతికి లోనవుతున్న మానవాళికి భగవాన్ బోధ అత్యంత శిరోధార్యము. ఆధునిక సమస్యలకు పరిష్కారం భగవాన్ శ్రీ రమణమహర్షి బోధ. సకల చరాచర సృష్టికి అధిష్టానము, సర్వవ్యాపకమైన చైతన్యమే మనలోని దేహేంద్రియ మనోబుద్ధులకు శక్తిని ప్రసాదిస్తుంది. అట్టి చైతన్యమే 'నీవు' అని బోధించి, సత్యాన్ని తానుగా దర్శింప జేయడమే భగవాన్ బోధాసారం. భగవాన్ శ్రీ రమణమహర్షి హృదయాన్ని మనకు మరింత దగ్గరగా చేర్చిన సద్గురు శ్రీ నాన్నగారికి మనము ఎంతో ఋణపడి ఉంటాం.

**– చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-11-2011, తణుకు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇది సత్సంగ సమావేశం. సత్సంగ సమావేశం అంటే సత్పురుషుల తోటి సమావేశం. సత్పురుషులను గౌరవించటం, సత్పురుషులను ఆరాధించటం కూడా సత్సంగమే. మనం సహృదయంతోటి ఇతరుల క్షేమం కోరటంకూడా సత్సంగమే. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలి అంటే శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం కాపాడుకోవాలి. మాయ అంటే ఎక్కడో ఉంది అనుకుంటాము. మాయ మన గుణాలలోనే ఉంది. సత్వగుణం ఉన్నవాడు మంచి స్నేహితుడిలాంటి వాడు. మాకు రైల్వేస్టేషను ఎక్కడ ఉందో తెలియదు అంటే సత్వగుణం ఉన్న వాడు మనల్ని జాగ్రత్తగా తీసుకువెళ్ళి మీరు ఏ ట్రైనుకి వెడతారు అని అడిగి మనలను నెమ్మదిగా స్టేషనులో కూర్చోబెట్టి వస్తాడు. తమోగుణం ఉన్నవారు, రజోగుణం ఉన్నవారు ఇతరుల కష్టాలు పట్టించుకోరు, దారి ఎటో కూడా చెప్పరు. అందుచేత తమోగుణం ఉన్నప్పుడు మనం మాటలు తగ్గించుకోవాలి. రజోగుణం ఉన్నప్పుడు మనం పనిచేస్తే భౌతికంగా కొంతలాభం వచ్చినా ఆధ్యాత్మికంగా మాత్రం మనం కుళ్ళిపోతూ ఉంటాము. ప్రతీ మనిషిలోను ఈ మూడు గుణాలు తిరుగుతూ ఉంటాయి. మనం లెక్కలు, ఇంగ్లీషు ఎలా నేర్చుకుంటామో అలా ఈ సత్వగుణాన్ని నేర్చుకోవాలి. మనకి సత్వగుణం వచ్చినప్పుడు జాగ్రత్తగా దాని టైము పెంచుకోవాలి. సత్వగుణం మనకి మోక్షానికి వెళ్ళేదారి చూపించి అది పక్కకి తప్పకుంటుంది. అందుచేత సత్వగుణాన్ని సాధ్యమైనంతవరకు కల్టివేట్ చేసుకుంటూ రావాలి. మాయకి ఆధారముగా ఉన్న ఈ మూడు గుణాలు దాటితేగాని మనకి బ్రహ్మము అనుభవములోనికి రాదు.

మీకు ఏ దేవుడు ఇష్టమైతే ఆ దేవుడిని మీరు ఉపాసన చేసుకోవచ్చు. ఉపాసన వలన ఏకాగ్రత వస్తుంది. ఆ దైవం పట్ల మనకి భక్తి కలగటం వలన మనం పవిత్రులం అవుతాము. ఈ దేహగతమైన నేనుని, ఈ మనోగతమైన నేనుని అతిక్రమించి వీటికి అతీతంగా ఉన్న నీ హృదయంలో అంతర్యామిగా ఉన్న సత్యాత్మను దర్శిస్తే నువ్వు పునర్జన్మల లోంచి బయటకు వస్తావు. నిజమైన దేవుడు నీ హృదయంలో మాత్రమే ఉన్నాడు. నువ్వు బయట ఉన్న దేవుడిని ఎంతగా ఆరాధించినా, ఆ దేవుడికి సంబంధించిన ఎన్ని భజనలు చేసినా నువ్వు పవిత్రుడవు అవుతావు, నీకు ఏకాగ్రత వస్తుంది కాని నువ్వు అజ్ఞానంలోంచి బయటకు రావు, పునర్జన్మలలోంచి బయటకు రావు ఇది రమణ సిద్ధాంతం.

గాఢనిద్రలో మనకి శరీరంతోటి సంబంధంలేదు, ప్రపంచంతోటి, పుణ్యపాపాలతోటి,

మీకు ఉన్న ఆస్తిపాస్తులతోటి దేనితోటి సంబంధం లేదు. కానీ మీరు లేరా అంటే ఉన్నారు. గాఢనిద్రలో మేము లేము అని ఎవరూ చెప్పరు. ఎందుచేతనంటే మెలకువరాగానే నేను బాగా నిద్రపోయాను అని చెబుతారు. అంటే మీ నిద్రని చూసేవాడు ఒకడు లోపల ఉన్నాడు. వాడే చైతన్యం. ఇప్పుడు మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఈ నేను గాఢనిద్రలో లేదు. మీ శరీరం కాలిబూడిద అవ్వకముందే ఈ దేహగతమైన నేను చావాలి. ఈ దేహగతమైన నేను చావకుండా మీకు మోక్షం లేదు. అప్పటివరకు పునర్జన్మలు మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాయి. నిజమైననేనుని మనం తెలుసుకునేవరకూ ప్రతీజన్మలోనూ ఏదో అశాంతి, ఏదో దుఃఖం, ఏదో వెలితి మిమ్మల్ని వెంటాడుతూ ఉంటుంది. మన ఆలోచనలు మనల్ని పాడుచేస్తున్నాయా లేక మన చైతన్యస్థాయిని పెంచుతున్నాయా అని మన మనస్సును ఎప్పటికప్పుడు వాచ్‌చేసుకుంటూ ఉండాలి. పూర్వజన్మల వాసనలను బట్టి వాళ్ళకి చెడు తలంపులు వస్తాయి, మంచి తలంపులు వస్తాయి. మీకు డిస్‌క్రిమినేషన్ ఉండాలి. ఆహార విషయంలో శుద్ధిగా ఉంటే మన బుద్ధికూడా శుద్ధిగా ఉంటుంది. అన్ని నియమాలలో ఆహార నియమం ముఖ్యమైనది. బజారుతిళ్ళు తినకూడదు. మనం వినే మాటల విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో తినే ఆహార విషయంలో కూడా అంతే జాగ్రత్తగా ఉండాలి. మనం లోపలికి వెళ్ళే దాంట్లో కొంచెము జాగ్రత్తగా ఉంటాము కానీ బయటకు వచ్చే మాటల విషయంలో ఏమీ జాగ్రత్తగా ఉండము.

ఫిజికల్ హెల్త్‌ఉంటే సరిపోదు, మానసిక ఆరోగ్యము కూడా ఉండాలి. మానసిక ఆరోగ్యం లేనప్పుడు మనుషులు హెచ్చుతగ్గులుగా ఉంటారు. వారి మాటల్లో అప్స్ డౌన్సు ఉంటాయి. వంకరమాటలు మాట్లాడతారు. కొంతమంది నవ్వితే వెటకారంగా నవ్వుతారు, వాళ్ళు విషం కక్కుతున్నారా అనిపిస్తుంది. అది వెటకారం నవ్వు అని మనకి తెలుస్తూ ఉంటుంది. దానివలన మనం పాడైపోము. వాళ్ళే పాడైపోతున్నారు అని వాళ్ళకి తెలియదు. ఓ తండ్రీ! వాళ్ళని క్షమించి ఆశీర్వదించు అన్నాడు ఏసు. కొంతమంది నవ్వితే ఆ నవ్వులో ఉన్న సౌందర్యాన్ని చూసి మనం జీవితంలో ఆ నవ్వు ఎప్పుడూ మరిచిపోలేము. అందులో కల్మషం లేదు. నోటితోటి మాట్లాడకుండా మనల్ని ఆశీర్వదించ టానికి నవ్వుతున్నారా అనిపిస్తుంది. కొంతమంది నవ్వులో విషం ఎలా ఉంటుందో అలా కొంతమంది నవ్వులో అమృతం ఉంటుంది. సత్వగుణం ఉన్నవాళ్ళు ధన్యులు, వారు దేవుని చూచెదరు. ఎవరికైనా కలహాలు వస్తే వారు సమాధానపరుస్తారు అన్నాడు ఏసు. మీ దేహప్రారబ్ధం బాగోక ఎన్ని

కష్టాలు పడుతున్నా మీరు కనుక శాంతచిత్తంతోటి ఉంటే విద్యావంతులు కంటే, ధనవంతులు కంటే మీరే అదృష్టవంతులు. ఎందుచేతనంటే మీకు డబ్బు ఎంత ఉన్నా శాంతచిత్తం లేకపోతే మీకు సుఖం లేదు.

ఓ అరుణాచలేశ్వరుడా ఈ శరీరం భౌతికమైన అగ్నికి ఆహుతి అవ్వకముందే నీ జ్ఞానాగ్నిని పంపి ఈ దేహగతమైన నేనుని కాల్చిబూడిద చెయ్యి తండ్రీ. ఈ దేహము నేను అనుకునేవాడే నరకాసురుడు. ఈ నరకాసురుడు చావకుండా నీకు ఆత్మజ్ఞానం వచ్చే అవకాశం లేదు. ఎందుచేతనంటే చీకటిని వెలుతురు పోగొట్టగలదుకాని, చీకటిని చీకటి పోగొట్టలేదు. ఒక గుడ్డివాడికి ఇంకో గుడ్డివాడు దారి చూపించలేడు. ఒక గుడ్డివాడికి ఇంకో కళ్ళున్నవాడు దారి చూపించగలడు. అజ్ఞానాన్ని, జ్ఞానం పోగొడుతుంది కాని అజ్ఞానం అజ్ఞానాన్ని పోగొట్టలేదు. అందుచేత మీకు అజ్ఞానం నశించాలంటే గురువు సహాయం అవసరం. గురువు దయ ఉండాలి. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశాలను జాగ్రత్తగా ఉపయోగించుకోండి. మీకు తెలివితేటలు ఉంటే, ఆ తెలివితేటలు అన్నీ మీ స్వార్థానికే కాకుండా ఇతరులకి కూడా మీరు ఉపయోగించండి. దేహం యొక్క ప్రారబ్దాన్నిబట్టి మీకు కొంత ఐశ్వర్యాన్ని ఇస్తాడు. ఆ ధనం దుర్వినియోగం చెయ్యకు, సద్వినియోగం చెయ్యి. మీ బంధువులు ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్నారు అనుకోండి వాళ్ళని హేళన చేయకండి, వాళ్ళకి సహకరించండి. మీరు ఏదైనా సహాయం చేస్తూ ఉంటే అది కుడిచెయ్యి చేసినది ఎడమ చెయ్యికి తెలియకుండా చెయ్యాలి. ఈ డబ్బు వాళ్ళ ఫ్యామిలీకి ఉపయోగపడాలి అని వినయంగా సహృదయంతోటి ఇవ్వాలి కాని ఏదో పడేశాం అన్నట్టు మీరు ఇవ్వకూడదు. మీరు ఏదైనా ఒక పని చేస్తే అది మీ కుటుంబానికి ఉపయోగపడాలి, సమాజానికి ఉపయోగపడాలి.

మనస్సుకి ఆధారంగా ఉన్న చైతన్యం మీకు తెలియకపోయినా మనస్సు మీకు తెలుస్తోంది, శరీరం తెలుస్తోంది కదా. ఈ తెలుసున్న శరీరాన్ని, మనస్సుని పవిత్రం చేసుకుంటూ ఆ చైతన్యాన్ని తెలుసుకోవటానికి ఈ రెండింటిని ఉపయోగించుకోవాలి. మీకు నిజమైన వైరాగ్యం ఉంటే మీరు భరించలేనంత ఆనందం వచ్చి మీ శిరస్సుమీద పడుతుంది. మీ వైరాగ్యం మిమ్మల్ని సుఖంతోటి తడిపేస్తుంది. నీకు అభ్యాసం, వైరాగ్యం ఉన్నప్పుడు హృదయం లోంచి వచ్చిన శాంతి మిమ్మల్ని ముంచేస్తుంది. అప్పుడు భగవంతుడు వచ్చి నీకు వైకుంఠం కావాలా, కైలాసం కావాలా అని అడిగితే నాకు అక్కరలేదు అంటావు. ఇష్టం లేకకాదు,

అవసరం లేక వద్దంటావు. ఏ సుఖాన్ని, ఏ శాంతిని, ఏ ఆనందాన్ని పొందిన తరువాత దానికి మించినది ఈ లోకంలోగాని, ఇతరలోకాలలోగాని లేదని మీకు అర్థమవుతుందో అటువంటి శాంతిని మీ శరీరం ఈ భూమి మీద తిరుగుతూ ఉండగానే మీరు పొందగలరు, దానికి మీరు వారసులు.

మనం అసలు భక్తిలేని వాళ్ళంకాదు, ఎంతోకొంత భక్తి ఉంది కానీ మన భక్తి సరిపోదు. ట్రూత్‌ని రీలైజ్ చేయటానికి బాడీని, మైండుని ప్రిపేర్ చెయ్యాలి. సత్కర్మ చేస్తే సరిపోదు, సత్కర్మ నిష్కామంగా చెయ్యాలి. మన హృదయంలో సద్వస్తువు ఉందని కూడా మనకి సూచనలు రాకపోవటానికి కారణం ఏమిటి అంటే మనందరం గర్వపరులం. మీ లోపల ఉన్న గర్వాన్ని సమాజానికి తెలియకుండా దాచుకుంటున్నారని ఆయనకు తెలుసు. మా కుటుంబం మంచిది, మాకు ఇంత డబ్బు ఉంది అని మీలో మీరు స్తుతి చేసుకుంటే, మీ సంపదను చూచి మీరు గర్వపడుతూ ఉంటే అప్పుడు మీరు ఎంత సాధన చేసినప్పటికీ భగవంతుడు మీకు తెలియబడడు. భగవంతుడు మీకు తెలియాలని ఆయన అనుకోకుండా మీకు తెలియబడడు. చాలా మేధావి కూడా ఆత్మని రీలైజ్ చేయలేడు. ఎందుచేతనంటే బుద్ధికి అది ఆబ్జక్టు కాదు. బుద్ధితోటి, మనస్సుతోటి ఇంగ్లీషు బాగా నేర్చుకోవచ్చు కాని అది బుద్ధితోటి, మనస్సుతోటి నేర్చుకునేది కాదు. నీ మనస్సు శేషం లేకుండా నిశ్శేషంగా ఎక్కడైతే అణిగిపోయిందో అక్కడ నీ స్వరూపం నీకు వ్యక్తమవుతుంది.

మనం ఎందుకూ పనికిరాని వారంకాదు, బొత్తిగా విశ్వాసహీనులం కాదు. మనం భగవంతుడిని ఎంతోకొంత నమ్ముతున్నాము. కాని ఈ నమ్మకం కంటే మిగతా విషయాలే మన హృదయంలో గాఢంగా, గూఢంగా ఉన్నాయి. గీతాంజలిలో రవీంద్రనాథ్‌ఠాగూర్ ఏమని చెబుతాడు అంటే నా బలహీనతలు ఏమిటో నాకు తెలుస్తున్నాయి, రాబోయే జన్మలకు కారణాలు ఏమిటో నాకు తెలుస్తున్నాయి, ఒకోసారి నా ఇష్టాలే నన్ను నైతికంగా పతనం చేస్తున్నాయి అని కూడా నాకు తెలుసు, నైతికంగా ఎప్పుడైతే పాడైపోయానో ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రాలేనని కూడా నాకు తెలుస్తోంది. నాకున్న అలవాట్లని, నాకు ఉన్న పనికిరాని వాసనలని వీటన్నిటినీ పోగొట్టు అని దేవుడి దగ్గరకి వెళ్ళి ప్రార్థన చేయాలని అనుకుంటున్నాను కానీ దేవుడి దగ్గరికి వెళ్ళి ప్రార్థిస్తే నిజంగా పోగొడతాడేమో అని నాకు భయం వేస్తోంది అన్నాడు. ఎందుచేతనంటే ఇవన్నీ పోతే నాకు ఆత్మానుభవం వస్తుంది అని నాకు తెలుసు. కానీ అసలు వస్తువుకంటే నాకున్న అలవాట్లు, నాకున్న వాసనలు, నాకున్న సంస్కారాలు

ఇవన్నీ నాకు ఎక్కువ ఇష్టంగా కనిపిస్తున్నాయి. నా అలవాట్లు పోతే నేను పోతానేమో, నా గుణాలు పోతే నేను పోతానేమో అని, తీరావెళ్ళి భగవంతుడిని ప్రార్థిస్తే ఆయన నిజంగా వాటిని పోగొడతాడని భయంవేసి అవి పోగొట్టమని నేను ప్రార్థించటంలేదు అన్నాడు. అంటే దాని అర్థం ఏమిటి అంటే మనం ఏదిగా ఉన్నామో దానికంటే మన అలవాట్లు, మన వాసనలు అంటే మనకు ఎక్కువ ఇష్టం. మన అలవాట్లకి మనం బానిసలు అయిపోయాం, మన వాసనలకి, మన సంస్కారాలకి మనం బానిసలం అయిపోయాము.

భగవద్గీతలో భగవంతుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని చెపుతున్నాడు, మరి నా హృదయంలో కూడా ఉంటాడు కదా, ఉంటే నాకు ఎందుకు తెలియబడటంలేదు అని ఒకరు భగవాన్‌ని అడిగారు. నీకు స్వార్థం ఉందా అని భగవాన్ అడిగారు. స్వార్థం ఉంది అన్నాడు. దేహబుద్ధి ఉందా అన్నారు. దేహబుద్ధి ఉంది అన్నాడు. ఆయన ఉన్నాడో లేదో తరువాత చెబుతాను ముందు నువ్వు నీకున్నవి పోగొట్టుకునిరా అప్పుడు నేను నీకు ఏమీ చెప్పనక్కరలేదు. ఆయన ఉన్నాడో లేదో నీకు అనుభవైకవేద్యం అవుతుంది అన్నారు. నువ్వు పోగొట్టుకోవలసింది పోగొట్టుకుంటే ఉన్నది ఏదో, అది నీకు తానుగా వ్యక్తమవుతుంది. నువ్వు గురువుని ఆశ్రయించు. సాధన చెయ్యి. నువ్వు నీ బిహేవియర్ పేటరన్‌ని మార్చుకుని నీ అజ్ఞానాన్ని నువ్వు పోగొట్టుకోవాలి కాని ఎవరో నీ మేనత్తో, నీ మేనమామో వచ్చి పోగొడతారని కనిపెట్టుకొని ఉండకండి. నీ ప్రయత్నం ఏదో నువ్వు చేసుకో. నీ శరీరం శుద్ధంగా ఉండాలి, వాక్కు శుద్ధంగా ఉండాలి, మనస్సు శుద్ధంగా ఉండాలి. ఆ శుద్ధి నిజమైతే అప్పుడు దైవసహాయం నీకు వస్తుంది. దైవసహాయం వలనే నువ్వు ట్రూత్‌ని రీలైజ్ చేయగలవుగాని దైవసహాయం లేకుండా నువ్వు ట్రూత్‌ని రీలైజ్ చేయలేవు. రిమంబర్‌గాడ్, యు మస్ట్ రిమంబర్ గాడ్, ఆల్వేజ్ రిమంబర్ గాడ్.

ఆచార్యులవారు అంటారు ఈ లోకంలో ఎవరూ ఎవరికీ ఏమీకారు. మన ఇంట్లో వాళ్ళు అయినా సరే వాళ్ళు కళ్ళు మూస్తే వాళ్ళకీ, మనకీ సంబంధంలేదు. అది నగ్నసత్యం. భగవంతుడు చెప్పిన మాటలు మీకు ఇష్టం లేకపోతే నమ్మటం మానేయండి కానీ మీరు నమ్మటం లేదని, భగవంతుడు చెప్పిన మాట మీద మీకు విశ్వాసం లేదని భగవంతుడు లేకుండా పోడు. లోపల ఉన్న సత్యము మీ నమ్మకాలమీద, మీ విశ్వాసాల మీద ఆధారపడి లేదు. మీ హృదయంలో ఉన్నది లేకుండా పోదు. మీకు దాని మీద కోపంగా ఉంది అనుకోండి, మీరు రెండు తాళ్ళు లోతు గొయ్యితీసి మీ హృదయంలో ఉన్న సత్యాన్ని అందులో కప్పెట్టేయండి.

అది ఆ మట్టిని తొలుచుకొని మళ్ళీ పైకి వచ్చేస్తుంది. మీ హృదయంలో ఉన్న సత్యం ఇట్ ఈజ్ నాలెడ్జ్, ఇట్ ఈజ్ బ్లిస్, ఇట్ ఈజ్ బీయింగ్, ఇట్ ఈజ్ హేపీనెస్. దానికి మించిన హేపీనెస్ లేదు. చైతన్యం వేరు, హేపీనెస్ వేరు కాదు. అగ్ని వేరు అందులో ఉన్న వేడి వేరు కాదు అగ్నిని వేడి విడిచిపెట్టి ఉండదు. అలాగే చైతన్యాన్ని విడిచిపెట్టి సుఖం ఉండదు. చైతన్యాన్ని విడిచిపెట్టి శాంతిలేదు, ఆనందము లేదు. కానీ ఆ చైతన్యానికీ నీ బాడీకి, నీ ప్రారబ్ధానికి ఏమీ సంబంధం లేదు. అది స్వతంత్రమైనది, అది అంతటా ఉంది.

భగవంతుడిపట్ల మేము భక్తిగా ఉన్నాము, శరణాగతి చేస్తున్నాము మరి మాకు సహాయం అందాలి కదా మాకు సహాయం అందటంలేదు అని ఒకరు భగవాన్‌ని అడిగారు. నీ శరణాగతి నిజమైతే భగవంతుడు సహాయం చేయటంలేదు అనే తలంపు నీకు రాదు. భగవంతుడి ఇష్టమే నీ ఇష్టం చేసుకో. భగవంతుడి సంకల్పమే నీ సంకల్పం చేసుకో. అప్పుడు నెమ్మదిగా నీ అహంకారం శూన్యం అయిపోతుంది. నీకు ఏదైనా సంపద వస్తే అది ఈశ్వరుడి ప్రసాదం అనుకో. నీకు ఏదైనా దారిద్ర్యం వస్తే అది కూడా ఈశ్వరుని ప్రసాదం అనుకో. దారిద్ర్యం వలన కూడా మనం కొంత ట్రైనింగు అవ్వాలి. దారిద్ర్యం చెడ్డది అనుకోకండి. బుద్ధుడు, ఏసు, రమణమహర్షి, రామకృష్ణుడు పూర్వం కొందరు దారిద్ర్యాన్ని వరించారు. దాని వలన మైండు ట్రైనింగు అవుతుంది. చేతినిండా డబ్బు ఉన్నప్పుడు కొన్ని కష్టసుఖాలు మనకి తెలియవు. మనకి ఆకలి వేసినప్పుడు ఆకలి విలువ తెలుస్తుంది. మనం 24 గంటలు అజీర్తితోటి బాధపడుతూ ఉంటే నిజంగా ఆకలిగా ఉన్నవాడి బాధ ఎలా ఉంటుందో మనకి తెలియదు. మీకు ఎప్పుడైనా కష్టాలు వచ్చినా, మీకు ఇష్టంలేని సంఘటనలు జరిగినా ఇది అంతా కూడా నీ మైండుకి ట్రైనింగు ఇవ్వటానికి, శరీరం మరణించిన తరువాత ఏదైతే నీకూడా వస్తుందో దానిని పవిత్రం చేయటానికి, దానిని కండిషన్‌లో పెట్టటానికి భగవంతుడు చేసే సంకల్పమే కాని, నీ మీద ఇష్టంలేక కాదు, నిన్ను బాధపెట్టాలని కాదు. బంగారాన్ని మంటలో వేసి ఎలా పవిత్రం చేస్తారో అలా నిన్ను ఇంకా ఎక్కువ పవిత్రం చెయ్యటానికే అలా చేస్తున్నాడు. భగవంతుడికి ఎవరంటే ఎక్కువ ఇష్టం ఉందో వాడికి పునర్జన్మ లేకుండా చెయ్యాలని అనుకున్నప్పుడు మీకు రాబోయే జన్మల ప్రారబ్ధం అంతా ఈ జన్మలో అనుభవింపజేసి ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. వాడు దేవుడు.

నీకు ఇష్టంలేని సంఘటనలు జరిగినా నిన్ను ఒక మంచిలోనికి తీసుకువెళ్ళటానికే అవి వస్తున్నాయి, నిన్ను తలుపుసందున కొంతకాలం నొక్కేసి అక్కడ నీకు ఎంత బాధవస్తుందో ఆ

బాధను నీకు చూపించి ఆ చీకటిని నీచేత అనుభవింపజేసి మహావెలుగులోనికి తీసుకువెళ్లటానికి ఈ బాధలకి నిన్ను గురిచేయవచ్చు. అందుచేత నీ సంకల్పానికి విరుద్ధంగా సమాజంలో ఏదైనా జరిగినా అది భగవంతుడి ప్రసాదంగా తీసుకో. భగవంతుడు ఇచ్చిన కష్టాలని నువ్వు ఎందుకు ప్రసాదంగా తీసుకోవటం లేదు అంటే నీకు భేదబుద్ధి ఉంది. ఆ భేదాన్ని నువ్వు ఓవర్‌కమ్ చెయ్యాలి. ఆయన నీకు ఏది ఇచ్చినా ప్రసాదంగా తీసుకోవాలి. ఒకసారి కృష్ణుడు మేనత్త కుంతీదేవిని నీకు ఏమి కావాలి అని అడిగాడు. నాకు నిరంతరము కష్టాలు ఉండాలి అని అడిగింది. అందరూ సుఖాలు కోరుకుంటూ ఉంటే నువ్వు కష్టాలు కోరుకుంటున్నావేమిటి అని అడుగుతాడు కుంతీ దేవిని. సుఖాలలో నేను నిన్ను మరచిపోతాను. కష్టాలలోనే నువ్వు ఎక్కువ నాకు జ్ఞాపకం వస్తావు. అందుచేత నిన్ను మరిచిపోయే సుఖాలుకాని, భోగాలుకాని నాకు వద్దు. నా కష్టం నిన్నెప్పడూ జ్ఞాపకంలోకి తీసుకువస్తూ ఉంటుంది. కష్టాలు, నష్టాలు ఇవేమి ఉండకూడదని నేను అనుకోవటం లేదు. అవి వున్నా కాని అవి నిన్ను జ్ఞాపకం తీసుకువచ్చేటట్టు అయితే అవి వున్నా నాకు అభ్యంతరం లేదు. నిన్ను తెలుసుకోవటానికి అవి కూడా సహిస్తాను అని కుంతీదేవి పరమేశ్వరుడికి చెప్పింది. మనకి దుఃఖం వస్తే రోగం అవుతుంది. అర్జునుడికి దుఃఖం వస్తే యోగం అయ్యింది.

మాకు భగవద్గీత చదవటానికి టైము లేదు, సత్కర్మ చేయటానికి టైము లేదు, సత్పురుషులతోటి స్నేహం చేయటానికి టైములేదు అయామ్ బిజీ అని కొంతమంది అంటారు. ఇప్పడు మీకు మృత్యువు వచ్చింది అనుకోండి ఏమండీ మేము బిజీగా వున్నాము అంటే యమధర్మరాజు ఊరుకుంటాడా? ఒక్క క్షణం వెయిట్ చేస్తాడా. మీకు మరణం వచ్చిన రోజున నేను బిజీగా ఉన్నాను అంటే మీకు మరణం ఆగదు. కొంతమంది ఎంత బిజీగా ఉన్నా ధ్యానం చేసుకోవటానికి, జపం చేసుకోవటానికి, భగవద్గీత అధ్యయనం చేయటానికి టైము కేటాయించుకుంటారు. గాంధీగారుకంటే బిజీగా ఉన్నవాడు ప్రపంచంలో ఎవడూ లేడు. ఆయన దగ్గరకి రకరకాల వ్యక్తులు వచ్చేవారు కాని ఆయన స్నానం అవ్వగానే భగవద్గీత, తులసీరామాయణం కొద్దిసేపు చదువుకోకుండా, కొంతసేపు హృదయ రాముడిని స్మరించు కోకుండా బయటకు వచ్చేవారు కాదు. అందుచేత మనకి ఎన్ని పనులు ఉన్నా సాధనకి కొంత టైము కేటాయించుకోవాలి. ఏమీ పనీపాటు లేకుండా తిరిగేవాడు నాకు టైములేదు అంటే అసలు వాడికి పని ఉంటే కదా టైము లేకపోవటానికి, వాడికి అసలు పనే లేనప్పడు ఇంక కేటాయించుకోవటం ఏముంటుంది? అందుచేత మీకు ఏదైనా ఇంటి పనులు

ఉంటే చేసుకోండి. ఇంటి పనులు చేసుకున్నప్పటికీ, వచ్చిన అతిధులని గౌరవించినప్పటికీ, మీకు అధ్యయనానికి , సత్పురుషులతోటి సహవాసం చేయటానికి మీకు టైము ఉంటుంది. మాకు టైము లేదు అనుకుంటే మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటున్నారు. ఎమ్.ఆర్.ఐ. స్కానింగు తీసినప్పడు బాడీలో ఉన్నది ఎంత స్వచ్ఛంగా కనిపిస్తుందో అలాగే మనస్సుని శ్రద్ధగా పరిశీలించుకోవాలి. ఇతరుల్ని విమర్శించటం వలన మనకు ఏమీ కలసిరాదు. మన మనస్సుని మనం పరిశీలించుకుని మనకి పరమాత్మానుభవం కలగటానికి ఏ విషయాలు అయితే అడ్డువస్తున్నాయో ఆ అడ్డంకులని తొలగించుకోవటమే సాధన.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-11-2011, మురమళ్ళ)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ గ్రామం పేరు మురమళ్ళ. ఇది ప్రాచీనమైన క్షేత్రం. శివుడికి నిత్యకళ్యాణం చేసే క్షేత్రాలు భారతదేశంలో రెండే ఉన్నాయి. 1. కాశీ, 2. మురమళ్ళ. కాశీలో ఉన్న ఆయన విశ్వనాధుడు, ఈయన వీరభద్రుడు. ఇక్కడ మునులు ఎక్కువగా తపస్సులు చేసుకొనేవారు. తపస్సు అంటే ఎండింపచేయటం. మన మనస్సును ఎండింపచేయాలి. శరీరాన్ని వదిలించు కోవటానికి మనం ఏమీ ప్రయత్నం చేయనక్కరలేదు. మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా చనిపోయినప్పడు ఈ శరీరం మనలను వదిలిపోతుంది. మనస్సును వదిలించుకోవటం చాలా కష్టం, దానికి సాధన అవసరం. ఈ మునులు ఎందుకు అంతకష్టపడి తపస్సులు చేయటం అని మనకు అనిపిస్తుంది. మనం ఆహారనియమం పెట్టుకొని, ఇంద్రియాలను మనస్సును నియమించుకొంటూ ఎంతో సాధన చేస్తేగాని మనస్సు నశించదు. మనోనాశనం అయితేగాని మనలో అంతర్యామిగా ఉన్న పరమేశ్వరుడు మనకు వ్యక్తంకాడు.

యాత్రలు చేయటం ఎందుకు అంటే రమణమహర్షిగారు ఏమని చెప్పారు అంటే అక్కడ ఏమీ లేదు అని తెలుసుకోవటానికి యాత్రలు చెయ్యాలి అని చెప్పారు. పుస్తకాలు చదవటం ఎందుకు అంటే అలా పుస్తకాలు చదవగా, చదవగా వాటిలో ఏమీ లేదు, ఉన్నదంతా లోపలే ఉంది బయట ఏమీలేదు అని తెలుస్తుంది. దానికోసం పుస్తకాలు చదవండి. మీరు ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని క్షేత్రాలు తిరిగినా నిజమైన దేవుడు, పరమేశ్వరుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయనకు రూపం లేదు, నామం లేదు, లేడా అంటే ఉన్నాడు. జీవకోటి అందరి హృదయాలలో అంతర్యామిగా ఉండి వారి ప్రారబ్ధం ననుసరించి ఆ శరీరాలను ఆడిస్తున్నాడు. ఆ శరీరంలో జీవుడు ఏ అనుభవాలు పొందాలో అవి అన్నీ పొందేవరకు

ఆ శరీరంలో జీవుడిని ఉంచుతాడు. వాడు ఈశ్వరుడు. ఆయనే ఈ సృష్టికంతా అధిపతి. రమణమహర్షిగారికి మరణానుభవం కలిగింది. మరణానుభవం కలిగింది కాబట్టి ఆయన నోరును ఈశ్వరుడు స్వాధీనం చేసుకొని ఆ నోటి ద్వారా మంచి మాటలు చెప్పించాడు. ఇక్కడ గ్రహించ వలసింది ఏమిటి అంటే ఆయనకు మరణానుభవం కలుగజేసింది ఎవరు? ఈశ్వరుడే కలుగజేసాడు. ఆయన ద్వారా మంచి మాటలు చెప్పింది ఎవరు? ఈశ్వరుడే చెప్పాడు. అంటే ఎటుతిరిగినా ఈశ్వరుడే అందుచేత మనం ఆయనను మరిచిపోకూడదు.

మనం అందరం ప్రేయస్సు మార్గంలో ఉన్నాము కాని శ్రేయస్సు మార్గంలో ఎవరూ లేరు. అందరూ భౌతికమైనసంపదను సంపాదించుకొందాము అని చూసేవారే గాని ఆధ్యాత్మికసంపదను సంపాదించుకొందాము అని చూసేవారు ఎవరూ కనబడటంలేదు. భౌతికసంపద ఎంత సంపాదించినా ఈ శరీరం ఎంత నిజమో, లోకం ఎంత నిజమో ఆ సంపదలు కూడా అంతే నిజం, మరణానంతరం అది ఎందుకు పనికిరాదు. ఈ లోకంలో ఉండగా ఊరేగింపులకు, సన్మానాలకు ఉపయోగపడతాయి. కేవలం భౌతికసంపద సంపాదించుకొని ఇంద్రియాలతో భోగించే వారిది ప్రేయోమార్గం అంటారు. నిన్ను ఆధ్యాత్మికంగా ఉన్నతశిఖరాలకు తీసుకొనివెళ్ళి శాంతిసాగరంలో, ఆనందసాగరంలో ముంచేది శ్రేయోమార్గం. ఈశ్వరుని దయ లేకుండా ఆధ్యాత్మికసంపద రాదు. ఆయన దయ కలగాలంటే మన ఇంద్రియాలను ఆయన దయ సంపాదించటానికి ఉపయోగించాలి. అంటే నోటితో ఆయన గురించే మాట్లాడుకోవాలి, చేతితో ఆయనకు సంతోషం కలుగజేసే పనులే చేయాలి. శాస్త్రంలో ఏ పని చెయ్యమని చెప్పాడో ఆ పనులే మనం చెయ్యాలి, శాస్త్రం వద్దని చెప్పిన కర్మ చేయకూడదు. భగవంతుడు చెయ్యమని చెప్పిన పనిని అది మనస్సుకు ఇష్టం లేకపోయినా చెయ్యాలి. అక్కడ మన మనస్సు ముఖ్యంకాదు, భగవంతుడే ముఖ్యం. అలా పనిచేసేవాడే భక్తుడు. మన మనస్సు చెప్పినట్లుగా గంతులు వేసేవాడు భక్తుడు కాదు. మీరు పూజలు చేసుకోండి, వద్దని నేను చెప్పటంలేదు, ఇవన్నీ రెండవపక్షం. మన ప్రవర్తనవలన, మన జీవితవిధానం వలన ఆయన అనుగ్రహం మనకు వస్తుంది కాని మనకు ఏదో పదికోట్లు ఉన్నాయని అందులో ఒకకోటి రూపాయలు పెట్టి పూజచేయించినంత మాత్రం చేత మీకు ఆయన దయరాదు. దాని వలన పుణ్యం రావచ్చు, అది అనుభవిస్తే పోతుంది. ఫలానా శరీరాన్ని నేను, ఫలానా పేరు నాది, నాకు ఇంత డబ్బు ఉంది అని మీ శరీరంతోటి, మనస్సుతోటి తాదాత్మ్యం చెంది మీరు మంచిపనులు చేసినా దాని వలన పుణ్యం వస్తుంది కాని జ్ఞానం

మిమ్మల్ని వరించదు. ఏదో గౌరవం వస్తుందని, పేరు వస్తుందని ఏవో మంచి పనులు చేస్తున్నాము కాని ఈశ్వరప్రీత్యర్థం మనం ఒక్క పనికూడా చేయటం లేదు. మనం ఎప్పుడైనా జ్ఞానం గురించి శ్రవణం చేస్తే అది సంపాదించాలనే బుద్ధి కలుగుతుంది. ఏదైనా సబ్జక్టు మీద మనకు అభిరుచి కలగాలంటే దాని గురించి శ్రవణం చేసి ఉండాలి. శ్రవణం చేయకపోతే మీకు అభిరుచి కలగదు.

సుఖం అనేది మన స్వరూపంలోనే ఉంది. మనకు డబ్బులేనప్పుడు డబ్బు ఉంటే సుఖం వస్తుంది అనుకొంటాము. మనకు అధికారం లేనప్పుడు అధికారం ఉంటే సుఖం వస్తుందని అనుకుంటాము ప్రపంచంలో ఎక్కడా ఏ వస్తువులోను సుఖం లేదు. సుఖం అనేది నీ స్వరూపంలో ఉంది. మీకు అందరికీ ఇళ్ళు ఎలా ఉన్నాయో అలాగే ఈశ్వరుడికి కూడా ఇల్లు ఉంది. గుడులు ఆయనకు అద్దె ఇళ్ళు. మన హృదయమే ఆయనకు నిజమైన ఇల్లు. మన ఆధ్యాత్మిక హృదయమే ఆయన నివాసం. అయితే మన లోపల ఉన్నవాడు మనకు అవగాహన అవ్వటంలేదు. అందుచేత ఆయనకు శివరూపమో, విష్ణురూపమో కల్పించి ఆయనను ఆరాధిస్తున్నాము. మనం ఒక రూపానికి, నామానికి కట్టుబడి ఉన్నాము కాబట్టి ఆయనకు కూడా ఒక రూపం పెట్టి, ఒక నామం పెట్టి ఆ రూపాన్ని, నామాన్ని ధ్యానం చేసుకొంటూ ఎక్కడైతే నిజమైన దేవుడు ఉన్నాడో అక్కడకు జరగటానికి ప్రయత్నం చేస్తున్నాము. ఇది స్పిరిట్యువల్ సైన్స్. ఇంతకంటే గొప్ప సైన్స్ ప్రపంచంలో లేదు. ఇది మిమ్మల్ని మరణాన్ని దాటించి, దుఃఖస్పర్శలేని చోటుకు తీసుకొనిపోతుంది, మిమ్మల్ని శాంతిసాగరంలో, ఆనందసాగరంలో ముంచుతుంది.

శాంతిలేనివాడికి సుఖంలేదు అన్నాడు త్యాగరాజు. మీకు ఎన్ని కంఫర్ట్సు ఉన్నా మైండ్‌కు కంట్రోలు లేనప్పుడు, ఇంద్రియాలకు కంట్రోలు లేనప్పుడు మీకు శాంతిరాదు. డబ్బు లేకుండా భోగంరాదు, శాంతి లేకుండా సుఖంరాదు. జ్ఞానం వలన శాంతివస్తుంది, సుఖం వస్తుంది, అంతేకాదు మీరు మరణాన్ని దాటిపోతారు. కోరిక, కోపము, భయము ఈమూడూ ఉన్నంత కాలం నీకు సుఖం కనబడదు. కోరిక, కోపం, భయం వీటిని పోగొట్టుకోవటానికి యజ్ఞ, దాన, తపస్సులను ప్రాక్టీసు చెయ్యమన్నారు. ఎక్కడ ప్రేమ ఉందో అక్కడ కోరిక వస్తుంది. మీ ఆయన అంటే మీకు బాగా ఇష్టం అనుకోండి, ఆయన మీద మీకు ప్రేమ ఉన్నప్పుడు ఆయనను సుఖపెట్టాలని కోరిక వస్తుంది. ఆ సుఖపెట్టాలనే కోరికలో నుండి ఏవో పనులు చేస్తూ ఉంటారు. కోరిక, ప్రేమ దగ్గర చుట్టాలు. అలాగే మీకు దేవుడి మీద ప్రేమ కలిగితే

మన చేతులతో ఆయనను ఆరాధించుకోవాలని, నోటితో ఆయన నామం చేసుకోవాలని, ఆయన గుడిచుట్టూ తిరగాలని అనిపిస్తుంది. కోరిక నెరవేరితే గర్వం వస్తుంది, నెరవేరకపోతే కోపం వస్తుంది అంటే నెరవేరితే ఒక గొడవ, నెరవేరకపోతే ఇంకో గొడవ ఎలాగైనా తంటాయే.

సన్మార్గుడి హృదయంలో ఏ జ్ఞానం అయితే ఉందో అది దుర్మార్గుడి హృదయంలో కూడా ఉంది. ఇద్దరి హృదయంలో జ్ఞానం సమానంగానే ఉంది. అయితే వాడిని దుర్మార్గుడు అంటున్నాము, వీడిని సన్మార్గుడు అంటున్నాము. ఇక్కడ గుణాలు తేడా. వాడి గుణాలను బట్టి వీడు మంచివాడు, వాడు చెడ్డవాడు అంటున్నాము. ఒకడికి చెడ్డగుణాలు ఉంటే వాడు ఆ గుణాలను వదిలేస్తే వాడిని మంచివాడే అంటున్నాము కదా. ఈ గుణాలన్నీ మనస్సులో ఉన్నాయి. మనస్సు అనే గెడపదాటితే అక్కడ మంచివాడు, చెడ్డవాడు అనే గొడవలేదు, అందరూ ఒకటిలాగే ఉంటారు. నువ్వు పాడైపోవటానికి నీ కామక్రోధములే కారణం అని భగవంతుడు చెప్పి ఈ కామక్రోధములు నీకు ఎక్కడనుండి వస్తున్నాయి అని అడిగాడు. ఇవి అన్నీ మనస్సులో నుండి వస్తున్నాయి. మనోనాశనానికి పూర్వం అనేకమంది ఘోర తపస్సులు చేసినట్లు మనం పురాణాలలో చదువుతున్నాము. మనస్సును పవిత్రం చేసుకోవటానికి, మనస్సును బాగుచేసుకోవటానికి, మనస్సును నిగ్రహించుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి, సాధన చేయాలి.

మనందరిలో ఉన్న చెడ్డ ఏమిటి అంటే ఆధ్యాత్మికవిషయాలలో, భక్తి విషయంలో మనకంటే పెద్దవారు అయిన రామకృష్ణుడు, రమణమహర్షి, వశిష్ఠుడు వంటి వారితో మనం పోల్చుకోము. హైదరాబాద్‌లో మనకంటే ధనవంతులు ఉన్నారుకదా వారితోటి పోల్చుకొంటాము, వారిలా అయిపోదాం అనుకొంటాము. మనకు జ్ఞానం మీద ఇష్టం లేదు, డబ్బు అంటే బాగా ఇష్టం. మనకు రామకృష్ణుడు, రమణమహర్షి గురువులు కాదు, ధనవంతులే మనకు గురువులు. ఏవో ఆధ్యాత్మిక పుస్తకాలు చదువుతాము కాని మనకు ధనం అంటే ఎక్కువ ఇష్టం. ఏదో కాలక్షేపానికి చదువుతున్నాము కాని లోపల మమకారం వేరు, శ్రద్ధవేరు. నీకు ధనవంతుల మీద ఉన్న గౌరవం గోచీపెట్టుకున్న రమణమహర్షి మీద, తుండు వేసుకొని తిరిగే రామకృష్ణ పరమహంస మీద లేదు. వారి పుస్తకాలు చదవవచ్చు కాని వారి మీద ఆప్యాయత లేదు, ప్రేమలేదు. ఎవడైనా వెయ్యి ఎకరాలు సంపాదిస్తే నేను వాడిలాగ వెయ్యి ఎకరాలు సంపాదించాలి అనుకొంటున్నాము కాని నేను రమణమహర్షిలాగ, రామకృష్ణుడిలాగ అవ్వాలి అనే ఆలోచన మనకు లేదు, అసలు వారితో మనం పోల్చుకోము. మనం లౌకిక

విద్యలు ఉన్నవారిని, ధనవంతులను లోపల ఆరాధిస్తున్నాము కాని ఋషులను, మహాత్ములను మనం ఆరాధించటంలేదు. నేను చెప్పానని మీరు నమ్మవలసిన పనిలేదు. మీ నిజజీవితంలో మీ అనుభవంలో చూసుకోండి. మీరు ఇంటికి వెళ్ళినతరువాత మీ హృదయంలో ఏమి ఉంది, మీరు నిజంగా ఎవరిని ఆరాధిస్తున్నారు అనే విషయం ప్రశాంతంగా ఆలోచించుకోండి, మీకు మీరే సాక్షి.

శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో. శాస్త్రం మనకు గొప్ప గురువు. ఏ పనిచేస్తే నువ్వు బాగుపడతావో, ఏ పనిచేస్తే నువ్వు పాడవుతావో శాస్త్రం చెబుతుంది. రైలు ఏవిధంగా అయితే పట్టాలననుసరించి వెళుతుందో అలాగే నువ్వు శాస్త్రాన్ని అనుసరించి జీవించు. నీ చేతులతో మంచి పనులు చెయ్యి, చెవులతో నిరంతరం భగవంతుడి గురించి శ్రవణం చెయ్యి. మీరు ఏదైతే సంపాదించాలి అనుకొంటున్నారో ఆ వస్తువు మీద నిజమైన ఏకాగ్రత కలిగి ఉండాలి. మీరు గుడికి వెళితే వెళ్ళండి కాని భగవంతుడిని ఏమీ కోరుకోవద్దు. నేను ఏది మంచిది అనుకొంటున్నానో అది నా అహంకారం అనుకొంటోంది, అది మంచిది కాకపోవచ్చు. నా జీవితాన్ని నీపాదాల దగ్గర పెడుతున్నాను, దేనివలన నాకు శ్రేయస్సు కలుగుతుందో, దేనివలన నాకు స్వరూపజ్ఞానం కలుగుతోందో అదే చెయ్యి. మనం పూజలు, జపాలు చేస్తున్నాము అవి యాంత్రికంగా చేస్తున్నాము. కాని హృదయపూర్వకంగా చేయటం లేదు. ఇవి అన్నీ లోపల ఏ ఉద్దేశంతో చేస్తున్నామో భగవంతుడు చూస్తూ ఉంటాడు, ఆయన సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు.

భగవంతుడు మీకు కేటాయించిన ప్రారబ్ధాన్ని ఇష్టంగా అనుభవించండి. మీ అత్తగారు మంచిదా, చెడ్డదా అనేది మీకు అనవసరం. ఆవిడ మీ అత్తగారు కాబట్టి ఆవిడ పట్ల మీరు చేయవలసిన సేవను ఇష్టంగా, ప్రేమగా చెయ్యండి. ఆవిడ మంచిదా, చెడ్డదా అనేది భగవంతుడు చూసుకుంటాడు. నువ్వు ఆ ఇంట్లోకే ఎందుకు వచ్చావు అంటే భగవంతుడు పంపించాడు, అది నీ దేహ ప్రారబ్ధం. నీ శరీరం ఆ ఇంటికి వచ్చింది కాబట్టి అక్కడ నువ్వు చెయ్యవలసిన డ్యూటీని ఇష్టంగా చెయ్యి. కనిపిస్తున్న మనుషుల మీద నీకు ప్రేమలేనప్పుడు కనిపించని దేవుడి మీద నీకు ప్రేమ ఎలా కలుగుతుంది. ఇప్పుడు ప్రపంచానికి ధనం కేంద్రం. ఎవడైతే ధనవంతుడో వాడిని గౌరవిస్తున్నారు. ధనవంతుడిని గౌరవిస్తున్నారు కాబట్టి మనం కూడా వాడిలాగ ధనం సంపాదించేసుకొందాము, మనం కూడా గౌరవింప బడదాము అనుకొంటున్నారు కాని ఇదంతా స్వప్న సమానము అని వారికి తెలియటంలేదు.

అనుకరణ పనికిరాదు. వారు అలా ఉన్నారు మనం కూడా అలాగ ఉందాము అని మీరు అనుకొంటే మీకు లోపల శక్తి లేదని అర్థం.

మీరు అస్తమాను రమణమహర్షి, రమణమహర్షి అంటారు, ఎందుకు మీకు రోజూ ఈ రమణమహర్షి గొడవ, మీరు సుఖంగా ఉన్నట్లు కనబడటంలేదు, వచ్చిన వారిని సుఖంగా ఉండనివ్వటంలేదు, ఆయన జ్ఞానదాత అంటున్నారు అదీ కనబడటంలేదు అని 20 సంవత్సరాల కిందట నన్ను ఇంటి దగ్గర భక్తులు అడుగుతూ ఉండేవారు. దక్షిణామూర్తి ఆదిగురువు అని చెపుతారు. ఆయన మహాపండితులకు జ్ఞానం ఇచ్చిన మాట నిజమే. రమణమహర్షిలో ఏముంది అని మీరు అడుగుతున్నారు. రమణమహర్షి పండితులకే కాదు చదువు లేనివారికి, చివరకు జంతువులకు కూడా జ్ఞానాన్ని ప్రసాదించాడు. ఆయన పైకి గొప్పగా కనిపించటంలేదు ఏదో గోచీ పెట్టుకొని కూర్చొన్నాడు. ఒక మనిషి యొక్క ఔన్నత్యాన్ని బాహ్యంగా చూచి ఎప్పడూ కొలవకూడదు. రమణమహర్షిలో ఏముంది అంటే ఇంక నేను ఏమి చెపుతాను. ఆయన చదువుకొన్నవారిని, చదువులేనివారిని, ధనం ఉన్నవారిని, ధనంలేని వారిని, అందమైన వారిని, కురూపులను అందరనూ సమానంగా చూసారు. ఎందుచేతనంటే ఆయనకు దేహబుద్ధి లేదు. ఇదేమిటండీ మీరు చదువుకొన్నవారికి ఏమి చెపుతున్నారో, చదువు లేని వారికి అదే చెపుతున్నారు, ఇద్దరికి ఒకేలాగ చెపుతున్నారు, మీరు చెప్పే పద్ధతి బాగా లేదు అని ఒకసారి గణపతిశాస్త్రిగారు భగవాన్‌ను అడిగారు. శాస్త్రిగారు మీరు చాలా పెద్దవారు, పండితులు. నేను అందరికి ఒకేలాగ చెపుతున్నాను అని అడుగుతున్నారు. అంటే మీ ఉద్దేశం చదువుకొన్న వారికి నిజాలు చెప్పి, చదువులేని వారికి అబద్ధాలు చెప్పమంటారా, ఇదెక్కడి న్యాయం అని అడిగారు. మీరు నా కంటే పెద్దవారు, మీరు చెప్పమంటే చెపుతాను కాని వారు వెళ్ళేటప్పడు వెనక్కి పిలిచి ఇంతవరకు నేను చెప్పినవి అబద్ధాలు, నమ్మవద్దు అని చెప్పి పంపేస్తాను అన్నారు భగవాన్. గురువు చేసే పని బాహ్యంగా కనబడదు. ఆయన చేసే పని అంతా లోపల చేస్తాడు. ఆయనకు గుర్తింపులు అక్కరలేదు అనేక జన్మలనుండి వస్తున్న వాసనలను, సంసార బంధాలను మన తెలివితేటల వలన మనం పోగొట్టుకోలేము. ఆయన మనతో తిరుగుతూ, మనం ఆయనను ప్రేమించకపోయినా ఆయన మీద ప్రేమ కలిగేటట్లు ఆయనే చేసుకొని, మిమ్మల్ని అనుగ్రహించి మీలో ఉన్న అజ్ఞానం అనే చీకటిని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు, వాడు గురువు. స్వరూపజ్ఞానాన్ని డబ్బు పెట్టి కొనుక్కోలేము, మన తెలివితేటల వలన సంపాదించలేము. బాహ్యశక్తులవలన, బాహ్యప్రక్రియల వలన మనలో

ఉన్న అజ్ఞానం నశించదు. సూర్యుడు ఉదయించే వరకూ చీకటి పోదు అలాగే గురువు దయలేకుండా, ఈశ్వరుని దయ లేకుండా నీలో ఉన్న అజ్ఞానం నశించదు.

గాఢనిద్రలో మనకు ఇంద్రియాల గొడవలేదు, లోకం గొడవ లేదు, శరీరం గొడవ లేదు, దేవుడి గొడవలేదు, ఏ గొడవ లేకుండా శాంతిగా ఉన్నాము. మనం గాఢనిద్రలో ఎలాగ ఉన్నామో జ్ఞాని జాగ్రదవస్థలో అదే స్థితిలో ఉంటాడు. కొండమీద దీపాన్ని కనబడకుండా ఎవడు ఆపుచేయగలడు అలాగే మీకు ఒక మహాత్ముడి మీద అసూయ కలిగినా ఆయన ఔన్నత్యాన్ని మీరు ఆపలేరు. మహర్షులు, జ్ఞానులు ఒకవేళ మాట్లాడకుండా ఏదో మూల కూర్చొన్నా వారి దగ్గరనుండి వచ్చే శాంతి తరంగాలు, కాంతి తరంగాలు లోకాన్ని ముంచేస్తాయి, వారిని గదిలో కూర్చోబెట్టినా వారి ఔన్నత్యం ఎక్కడ ఆగుతుంది.

నీవు నీవుగా ఉన్నప్పుడు, ఏది నువ్వు అయి ఉన్నావో అది నీకు అనుభవంలో ఉన్నప్పుడు ఈ శరీరము, ప్రపంచము, మనస్సు ఈ నీడలు ఉంటే ఏల? పోతే ఏల? ఎంత ఛాలెంజింగ్ సబ్జక్టో చూడండి. ఏదో శాస్త్రం చదివిచెప్పటంకాదు. ఇది భగవాన్ నోటి నుండి వచ్చింది. ఈ శరీరం కనిపించవచ్చు, కనిపించకపోవచ్చు. ఈ లోకం కనిపించవచ్చు, కనిపించకపోవచ్చు ఇవన్నీ నిజమా? ఇవన్నీ నీడలు. ఎండలోకి వెళితే మీ నీడ మీకు కనిపిస్తోంది, ఇక్కడ కూర్చొంటే మీ నీడ కనబడటం లేదు. అలాగని మీరు ఏమైనా నష్టపోతున్నారా? మీ నీడలు మీకు కనబడటంలేదని మీకు వచ్చే నష్టం ఏమిటి? అవి కనిపిస్తే ఏల? కనబడకపోతే ఏల? వాడికి ఎంత డబ్బు ఉంది, వాడు ఏమి చదువుకున్నాడు అనే దాంట్లో ఏమీ లేదు. వాడి హృదయం ఎలా ఉంది అనేది చూడండి. వాడికి బాహ్యంగా ఏమి ఉంది అనేది ముఖ్యంకాదు, వాడు లోపల ఎలా ఉన్నాడు అనేదే ముఖ్యం.

చైతన్యం అనేది నువ్వు మనస్సుతో గ్రహించే వస్తువుకాదు. ఎక్కడైతే ఇంద్రియాలు, మనస్సు పూర్తిగా అణిగిపోయినాయో అక్కడ చైతన్యం స్వరూపంగా నీకు వ్యక్తమవుతుంది మనకు లోపల అర్హత, యోగ్యత లేకపోతే కేవలం మన కోరిక వలన జ్ఞానం కలుగదు. లోపల మెచ్యూరిటీ రావాలి. మనలో అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడు. మనకు ఎంత వరకు మెచ్యూరిటీ వచ్చిందని ఆయన లోపలనుండి చూస్తూ ఉంటాడు. మనకు అర్హత వచ్చినప్పుడు ఆయన మనకు తెలియబడతాడు. ఒక మనిషి ఇంకో మనిషిని మోసం చేయవచ్చు కాని అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని మనం మోసం చేయలేము. నీలోపల ఉన్న వాసన, నీ లోపల ఉన్న సంస్కారం తలంపు రూపంలోనికి వచ్చాకగాని అది ఉన్నట్లు

నీకు తెలియదు. అంతవరకు నేను బుద్ధిమంతుడను అనుకొంటావు. ఆ వాసన ఎప్పుడో కోరిక రూపంలో నీ మెదడులోనికి వస్తుంది. నాకు ఇటువంటి కోరికలు ఉన్నాయా అని అప్పుడు నీకు తెలుస్తుంది. ఎందుచేతనంటే ఆయన చట్టప్రకారం నీ లోపల ఉన్న వాసనలు బ్రెయిన్‌లోనికి వస్తాయి. కృష్ణుడు ధర్మరాజుతో పదిమంది మంచికోసం ఒక అబద్ధం చెప్పమంటున్నాను అంటే ధర్మరాజు అబద్ధం చెప్పను అంటాడు. నన్ను ఎవరు అనుకొంటున్నావు అని కృష్ణుడు ధర్మరాజును అడిగాడు. నువ్వు ఈశ్వరుడివి అని నాకు తెలుసు అంటాడు. అబద్ధం చెప్పమని ఈశ్వరుడే నీకు చెపుతూ ఉంటే చెప్పటానికి నీకు అభ్యంతరం ఏమిటి అంటాడు. అబద్ధం చెపితే నాకు పాపం వస్తుంది అంటాడు ధర్మరాజు. నీ అంతట నీవు చెప్పటం లేదు నేను చెప్పమంటే చెపుతున్నావు కాబట్టి నీ పాపాన్ని నేను భరిస్తాను అంటాడు కృష్ణుడు. అప్పుడు వ్యాసుడు అంటాడు ధర్మరాజు పాపాలను భరిస్తాను అంటున్నావు, మరి మా మాట ఏమిటి? అజ్ఞానంలో ఉండి తెలిసి తెలియక మేము అనేక పాపాలు చేస్తున్నాము మా పాపాలు అన్నీ కూడా నీవే భరించాలి అంటాడు వ్యాసుడు.

కొంతమందికి వారు చేసేది తప్పు అని వాళ్ళకు తెలుస్తూ ఉంటుంది, కొంతమంది తెలియక చేస్తారు. మనిషి తెలిసుండి ఎందుకు తప్పు చేస్తునాడు అంటే దీనికి అలవాట్లు యొక్క వేగం, కోరికల యొక్క వేగం కారణం. ఈ అలవాట్లు, కోరికలు అన్నీ మనస్సులో ఉన్నాయి. ఈ మనస్సు చిరిగిపోతే అలవాట్లు లేవు, కోరికలు లేవు. అందుచేత లోకాన్ని జయించిన వాడికంటే మనస్సును జయించినవాడే నిజమైన హీరో. రామకృష్ణుడికి పెళ్ళి అయిన తరువాత కొంతకాలానికి శారద తండ్రి శారదను తీసుకొని రామకృష్ణుడి దగ్గరకు వస్తాడు. అప్పుడు రామకృష్ణుడు శారదతో ఏమన్నాడు అంటే నేను ఈ ప్రకృతికి అతీతంగా జీవించాలి అనుకొంటున్నాను, నన్ను ప్రకృతిలోనికి లాగేస్తావా శారదా అంటాడు. ఏం డైలాగ్ చూడండి. నేను మనస్సులో ఉన్న గుణాలకు అతీతంగా జీవించాలి అనుకొంటున్నాను, నన్ను పడగొట్టేస్తావా శారదా అంటాడు. ఓ రామకృష్ణా! నిన్ను కిందకు పడగొట్టటానికి రాలేదు నువ్వు ప్రకృతిని దాటి వెళ్ళటానికి నా సహాయసహకారములు అందించటానికి వచ్చాను అని శారదామాత చెప్పింది. మన బుర్రలకు అందని ఏదో గొప్పతనం ఆవిడలో ఉంది కాబట్టే ఈ ప్రపంచంలో రామకృష్ణుడికంటే ఎక్కువ గౌరవం శారదామాత పొందింది.

భగవంతుడి వాక్యాన్ని విశ్వసించు. ముందు భగవంతుడి మీద నీకు విశ్వాసం ఉంటే ఆయన మాట మీద కూడా నీకు విశ్వాసం ఉంటుంది. అది ఒకరోజు, రెండు రోజులు

కాదు. నీ కుటుంబ పరిస్థితులు, సమాజపరిస్థితులు నీకు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా కూడా నువ్వు ఎప్పుడూ భగవంతుడిపట్ల విశ్వాసం, ఆయన పట్ల ప్రేమ కలిగి ఉండు. ఎందుచేతనంటే మరణానంతరం నీ కూడా వచ్చేది అదే. ఈ రోజు కట్టుకొంటే రేపు చిరిగిపోయే బట్టలకు ఇచ్చే విలువ మరణానంతరం మన కూడా వచ్చే విషయాలకు ఇవ్వటం లేదు. దైవీసంపద మరణానంతరం మన కూడా వస్తుంది. ఆ దైవీసంపదను మనం పెంచుకోవాలి. భగవంతుడు మీద మనకు విశ్వాసం లేనప్పుడు, ఆయన చెప్పిన శాస్త్రం మీద మనకు విశ్వాసం లేనప్పుడు దైవీసంపదను ఎలా సంపాదించుకొంటావు. అందుచేత భగవంతుడిని విశ్వసించు, ఆయనను ప్రేమించు. అప్పుడు భగవంతుడు చెప్పిన వాక్యం మీద నీకు సహజంగానే ప్రేమ కలుగుతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-11-2011, గొరగనమూడి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

విద్య రెండు రకాలుగా వస్తుంది. 1. తెలివితేటలు ఉండాలి, కష్టపడి చదువుకోవటం వలన విద్య వస్తుంది. 2. తపస్సు చేయటం వలన కూడా విద్య వస్తుంది. పూర్వం ఋషులు ఏ కాలేజీకి వెళ్ళి చదువుకోలేదు. కానీ వాళ్ళు తపస్సు చేయటం వలన విద్యావంతులు అయ్యారు. జ్ఞానానంద జ్ఞానయోగి, కర్మయోగి. జ్ఞానానంద హృషీకేష్‌లో, హిమాలయాలలో చాలాకాలం తపస్సు చేస్తూ గడిపారు. తరువాత ఆయన సైన్సు రంగానికి, మేథమెటిక్స్ రంగానికి ఎక్కువ ఆకర్షించబడ్డారు. ఆయనది హైలీ కాన్సన్‌ట్రేటెడ్ బ్రెయిన్. ఒక సంవత్సరంలో నేర్చుకునేది రెండు నెలలలో నేర్చుకోగలరు. స్వామి వివేకానందకి ఏదైనా పుస్తకం ఇచ్చి చూడమంటే ఒక గంట చూసి మళ్ళీ తిరిగి ఇచ్చేసి అందులో ఏమైనా ప్రశ్నలు అడగండి చెబుతాను అనేవారు. అంటే వారివి హైలీకాన్సన్‌ట్రేటెడ్ బ్రెయిన్స్. అంటే క్విక్ గ్రాస్పింగ్. అయితే అంత ఏకాగ్రత రావటం కష్టం. మనిషి పవిత్రుడు అయ్యేకొలదీ ఏకాగ్రత పెరుగుతుంది.

కర్మమార్గం ద్వారా కూడా తరించవచ్చును, కర్మమార్గం విడిచిపెట్టనక్కరలేదు అని స్వామి శివానంద చెప్పేవారు. కర్మమార్గం కష్టం అనుకోనక్కరలేదు. మన శరీరాన్ని, మన ఇంద్రియాలను, మన మనస్సుని భగవంతుడికి సంబంధించిన పనిలో కూడా ఉపయోగిస్తూ ఉంటే అవి నిర్మలమౌతాయి, మనస్సు అంతర్ముఖమవుతుంది. నువ్వు పనిలో కూడా భగవంతుడిని చూడు అని శివానంద యొక్క స్లోగన్. మనం గుడికి పని చేయించటం,

భగవంతుడికి అభిషేకం చేయించటం ఎటువంటిదో అలాగే ఒక చెరువు తవ్వించటం లేకపోతే ఒకరికి ఇల్లు కట్టిపెట్టటం, ఒక మనిషికి సహాయ, సహకారములు అందించటం ఇవి కూడా దేవుడు పనికిందే చెయ్యాలి. మన కళ్ళకి కనిపిస్తున్న ఈ ప్రపంచం అంతా భగవంతుడి కుటుంబం. మీ కుటుంబం కాదు, నా కుటుంబం కాదు. ఇది భగవంతుడి కుటుంబమే అని ఆయన కుటుంబంలో ఎవరికి సహకరించినా అది ఆయనకే అందుతుంది. కర్మమార్గం వల్ల నీ ఇంద్రియాలు, నీ మనస్సు స్వాధీనంలోకి రావాలి. అవి అంతర్ముఖం అవ్వాలి. సత్యాన్ని రీలైజ్ చెయ్యటానికి అవి ఫిట్ అవ్వాలి. మన మనస్సు, మన ఇంద్రియాలు మనల్ని బాధిస్తున్నంత కాలం మనకి అశాంతి తప్పించి శాంతి రాదు, ఈ జన్మలోనే కాదు, వెయ్యిజన్మల తరువాత కూడా శాంతిలేదు.

ముందు నిన్ను నువ్వుచూచుకుని లోకాన్ని చూడు అన్నారు భగవాన్. నీ స్వరూపాన్ని చూసుకుని లోకాన్ని చూస్తే లోకంకూడా నీ స్వరూపంగానే కనిపిస్తుంది కానీ భిన్నంగా లోకం కనపడదు. మనకంటే లోకం వేరుగా కనపడటం వలన మనకి లోకం మీద మోహం కలుగుతుంది, లోకం మీద ఆకర్షణలు వస్తున్నాయి, భ్రాంతి పుడుతోంది. ఈ బేధబుద్ధిలోంచి మాయవస్తుంది. లోకం అంతా మనలాగే కనిపిస్తూ ఉంటే అందులో భ్రాంతికి అవకాశం లేదు. ఎటు చూచినా నిన్ను నువ్వే చూచుకుంటున్నావు. నీకంటే భిన్నంగా ఏమీ లేదు అని అది నీకు అనుభవంలోనికి రావాలి. ఆ సద్వస్తువు అనుభవంలోనికి వచ్చినప్పుడు అది నిజమా, కాదా అని నీకు ఏ సందేహాలు రావు. అది ఉండటం వల్లే అది తెలియబడుతూ వుంటుంది కాని దానికి ఋజువులు, సాక్ష్యాలు అక్కరలేదు. మనం పుస్తకాలు చదవటం నేర్చుకున్నాము కాని మన మనస్సుని మనం చదువుకోవటంలేదు. మన మనస్సుని మనం చదువుకుంటేనే మనకి జ్ఞానం కలుగుతుంది, పుస్తకాలు చదివితే పాండిత్యం వస్తుంది. కాని నీవు ఎవరివో నీకు తెలియబడదు. నీ మనస్సుని చదువుకుంటేనే నీవు ఎవరివో నీకు తెలియబడుతుంది. అందుచేత పుస్తకాలు కాదు నీ మస్తకాన్ని కూడా చదువుకుంటూ ఉండు అని పెద్దలు చెబుతూ ఉంటారు.

ఆంజనేయస్వామి రాముడు కూడా ఉండేవాడు. రాముడే సత్యము, రాముడే జ్ఞానము, రాముడే అనంతము అనే భావనతో నిరంతరం ఉండటం వలన సాక్షాత్తు పరబ్రహ్మమే కాళ్ళూ, చేతులూ తొడుక్కుని ఇలా నడుస్తోంది అనేటటువంటి అనుభవం ఆంజనేయస్వామికి కలిగింది. ఆంజనేయస్వామికి ఆ అనుభవం కలిగిన తరువాత ఎవరినీ రాముడు దేవుడు

అవునా, కాదా అని అడగలేదు. ఆంజనేయస్వామికి వచ్చినటువంటి అనుభవం మనకి కూడా వస్తుంది. కాని మనం ఆలోచించేది ఒకటి, చెప్పేది ఒకటి, చేసేది ఒకటి. అసలు ఈ మూడింటి మధ్యన సమన్వయం లేనప్పడు మనకి భగవంతుడి దర్శనం ఎలా అవుతుంది. అవి మూడూ నిదానంగా పవిత్రంగా ఉండాలి, సమన్వయంగా ఉండాలి. అప్పడు భగవంతుడి దర్శనం మనకి అవుతుంది.

జీవకోటి అనేకం ఉంది. కానీ అన్ని జీవరాసులకంటే మానవ శరీరానికి ఎక్కువ విలువ ఉంది. అంటే ఇది ధర్మం, ఇది అధర్మం, ఇది చేయదగినది, ఇది చేయకూడనిది అనే వివేకము, విచక్షణ మనకి ఉంది. మనకి ఉన్న వివేకము, విచక్షణ జంతువులకి లేదు. కాబట్టి అన్ని శరీరాలలో మానవ శరీరము చాలా ఉత్కృష్టమైనది. గత జన్మలలోంచి వచ్చే దోషాలు మన బుద్ధిలో ఉంటాయి. అవి మనం జాగ్రత్తగా, పరిశీలనగా చూసుకుంటూ మనకి వచ్చిన మైనస్ పాయింట్లు ఏమిటో జాగ్రత్తగా చూచుకుని అవి తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి అదే సాధన. దానికి మన ప్రయత్నం కావాలి. ఈశ్వరానుగ్రహం కావాలి, గురువు అనుగ్రహం కావాలి. ఈ మానవజన్మలో మనకి భగవంతుడు కొన్ని అవకాశాలు ఇచ్చాడు. మనకి భగవంతుడు ఇచ్చిన అవకాశాలు అన్నింటినీ జాగ్రత్తగా ఉపయోగించుకుని మనకి ఉన్న బలహీనతల్లోంచి బయటకు రావాలి. జరిగిపోయిన గొడవల గురించి ఎవరూ బెంగపెట్టుకోకూడదు. జరిగిపోయిన గొడవలు ఉంటే వాటిల్లోంచి పాఠాలు నేర్చుకోవాలి కాని చింతాకంత చింత కూడా ఉండకూడదు. జరిగిపోయిన గొడవల్లోంచి మీరు పాఠాలు నేర్చుకుని మళ్ళీ ఆ పునాది మీద మీరు అభివృద్ధిలోకి రావటానికి ప్రయత్నం చెయ్యాలి. మనం ఎవరమూ సాధనకి జీవితాన్ని ఖర్చుపెట్టటం లేదు. మీ ఇంటికి ఎవరైనా కాఫీకి వస్తే మీ ఇంట్లో ఉన్న రూపాయి కాయితాలు పొయ్యిలో పెట్టి కాఫీకాచి ఇస్తే ఎలా ఉంటుందో అలా చిల్లర గొడవలకి మన జీవితాన్ని వేస్తు చేస్తున్నాము. భగవంతుడు మనకి తెలివితేటలు ఇచ్చాడు. విచక్షణ ఇచ్చాడు, సత్పురుషుల్ని ఇచ్చాడు, దేవతల్ని ఇచ్చాడు, ఇన్ని అవకాశాలు ఉన్నప్పటికీ మీరు పవిత్రమైనటువంటి మానవజన్మను దుర్వినియోగం చేసుకుంటున్నారు. కాలాన్ని పాడుచేసు కొంటున్నారు.

ఏ దేశమేళ్ళినా, ఏ మూలకి వెళ్ళినా ఈ ప్రపంచంలో రాగద్వేషములు తప్పించి ఏమీ లేవు అన్నాడు గౌతమబుద్ధుడు. కొంతమందిని చూచి ఇష్టపడుతున్నాం, కొంతమందిని చూచి అయిష్టపడుతున్నాం. ఇష్టంగా ఉన్నవాళ్ళకి ఉపకారం చేయటం, అయిష్టంగా ఉన్న వాళ్ళకి అపకారం

చేయటం. ఇంకోపని మనకి చేతకాదు. నీకు ఎక్కడో ఒకచోట ఇష్టం ఉంది అనుకో ఆ ఇష్టం ఉన్నచోట వాళ్లకి ఏదైనా చెడ్డ జరిగితే నీకు అశాంతి వస్తుంది. అసలు ఎక్కడా నీకు ఇష్టం లేనప్పుడు చెడ్డజరిగినా నీకు అశాంతి ఎందుకు వస్తుంది? అశాంతి రాదు. మనం సబ్జక్టుని వదిలేసి, మనస్సుని అంతర్ముఖం చెయ్యటం మానేసి, సత్యాన్వేషణ వదిలేసి జీవితం అంతా రాగద్వేషాల మధ్య తిరుగుతున్నాము. మనల్ని ఎవరో వచ్చి బంధించేస్తున్నారు అని అనుకుంటాము. కానీ ఎవ్వరూ మనల్ని బంధించటం లేదు. మన రూపం, మన నామమే మనల్ని బంధిస్తున్నాయి. ఈ రూపబుద్ధిలోంచి, నామబుద్ధిలోంచి బయటకు వస్తే అసలు నేను, నాది అనేది ఎక్కడ ఉంది. ఆత్మానుభవం పొందినవాడికి అసలు నేను, నాది అనే తలంపు లేదు. మీ రూపబుద్ధిలోంచి, మీ నామబుద్ధిలోంచి మీరు బయటకు రండి. అప్పటికప్పుడు మీరు శాంతిసముద్రంలో ఊగిసలాడుతారు. ఈ రూప బుద్ధిలోంచి, నామబుద్ధిలోంచి మనం బయటపడగలిగితే ఉన్నది ఉన్నట్టుగా మీకు వ్యక్తమవుతుంది. అందుచేత మనం ఒక మహాత్ముడి యొక్క దయ సంపాదిస్తే చాలు, మనం జ్ఞానం ఆర్జించటానికి వారసులం అవుతాము. మీరు జ్ఞానానంద, శివానంద, రమణ మహర్షిలాగ అవ్వవచ్చు. వాళ్ళు కష్టపడ్డారు కాబట్టి, వాళ్లలాగే మీరు కూడా కష్టపడితే మీరు కూడా అలాగ అవ్వవచ్చు. చైతన్యం అనేది వాళ్ల సొంత ప్రోపర్టీ కాదు. అయితే మన మనస్సు, మన ఇంద్రియాలు, మన బుద్ధి అంతర్ముఖం అవ్వాలి. మనం పూర్వజన్మల్లో పుణ్య కర్మ చేసి ఉండాలి, సత్కర్మ నిష్కామంగా చేసి ఉండాలి. నీకు నేను అనే తలంపు నాది అనే తలంపు లేదు అనుకో, స్వార్థం ఎలా ఉంటుందో నీకు తెలియదు అనుకో ఇంక జ్ఞానం తప్పించి ఏమీలేదు.

మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే మన భక్తిని, మన కర్మని పూజ గదికి పరిమితం చేయకూడదు. పూజగదిలోనే దేవుడు ఉన్నాడా? ఇంక ఎక్కడా దేవుడు లేడా? ఈ సృష్టి అంతా భగవంతుడే ఆవరించబడి ఉన్నాడు. రాముడి శరీరం ఇప్పుడు లేకపోవచ్చు, చైతన్యం ఎక్కడికి వెళ్లింది. సృష్టి అంతా ఆవరించబడి ఉన్నది చైతన్యమే. సృష్టిచేత అది కప్పబడి ఉంది కాబట్టి చైతన్యం మనకి తెలియటం లేదు. ప్రపంచం ఉందా, లేదా అని భగవాన్‌ని ఒకరు అడిగితే, ఆయన ఉందని చెప్పలేదు, లేదు అనీ చెప్పలేదు. ఉన్న దానివలె కనిపిస్తోంది అన్నారు. అంటే లేదని చెప్పటం. నిన్ను నువ్వు చూచుకుని ప్రపంచాన్ని చూస్తే ప్రపంచం ఎక్కడ ఉంది. మనకి నిద్దట్లో ప్రపంచము ఎక్కడ ఉంది. నీకు చైతన్యం అనుభవంలోనికి వచ్చినప్పుడు, చైతన్యంకంటే వేరుగా నీకు ప్రపంచం కనపడదు.

రాగద్వేషాలలోంచి, కామక్రోధాలలోంచి విడుదల పొందటంకంటే కీర్తికాంక్షలోంచి విడుదల పొందటం చాలా కష్టం. మనకి డబ్బు కూడా కంట్రోలుగా ఉండాలి. నీకు డబ్బు ఉన్నా, మంచితనం ఉన్నా పైకి కనపడకూడదు. ఆ చేసేది నిర్మలంగా, నిశ్చలంగా చెయ్యాలి. ఆలోచన లేకుండా, వివేకం లేకుండా ఏ పని చేయకూడదు. మీరు ఖర్చు పెట్టే డబ్బు మీ అహంకారాన్ని పెంచకూడదు, మీ ఇంద్రియాలకి విచ్చలవిడితనం రాకూడదు. మీ మనస్సకి చపలత్వం రాకూడదు. మీరు ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెట్టినా లేకపోతే ధనాన్ని ఈరకంగా ఖర్చుపెడితే మనకి గొప్ప వస్తుంది అని ఖర్చుపెట్టినా ఆ ధనం వలన నీకు పాపం వస్తుంది కాని పుణ్యం రాదు. ఆ డబ్బు ఖర్చు పెట్టే విధానంలో దేవుని అనుగ్రహం పొందటానికి చేస్తున్నావా? లేకపోతే ఈ లోకంలో గొప్పలు సంపాదించటానికి డబ్బు ఖర్చుపెడుతున్నావా అని భగవంతుడు నీలోపల భావాన్ని చూస్తాడు. మీ డబ్బుని సవ్యంగా ఖర్చుపెడితే ద్రవ్యయజ్ఞం అవుతుంది. నీ కుడిచెయ్యి చేసేపని నీ ఎడమచెయ్యికి కూడా తెలియనివ్వవద్దు అని ఏసు చెప్పాడు. అలా నువ్వు పని చేస్తే దేవుని అనుగ్రహానికి పాత్రుడవుతావు. మీలో ఐశ్వర్య వంతులు ఉండవచ్చు. మీ ఐశ్వర్యం మీ మనస్సుని, మీ ఇంద్రియాలని పాడుచేయకూడదు. మీ మనస్సు, మీ ఇంద్రియాలు స్వాధీనంలోకి రావటానికి మీ ఐశ్వర్యం ఉపయోగపడాలి. ఆత్మజ్ఞానసముపార్జనకి అనుకూలంగా ఉపయోగించుకోవాలి. ధనాన్ని సద్వినియోగం చేసుకుంటే సత్వగుణం పెరుగుతుంది. ధనాన్ని దుర్వినియోగం చేసుకుంటే రజోగుణం పెరుగుతుంది. లోకంలో అనేక ఆకర్షణలు, అనేక భోగాలు ఉన్నాయి. డబ్బుంటే భోగం, భోగాన్ని బట్టి రోగం, భోగం లేకపోతే రోగం ఏమీ రాదు.

మనలో పాపపుదుంప ఉన్నంతకాలం మన ముఖం అసలు సత్యం వైపుకికాని, జ్ఞానం వైపుకికాని, భగవంతుడివైపుకికాని తిప్పినా తిరగదు. వేసవికాలంలో గడ్డి అంతా ఎండిపోతుంది. ఒక్క వర్షం కురిసేటప్పటికి మళ్ళీ ఆ దుంప గడ్డికింద వచ్చేస్తుంది. మీరు గడ్డపారపెట్టి తవ్వి ఆ దుంప తీసేయండి. అప్పుడు వర్షం వచ్చినా ఇంక గడ్డిరాదు. అలాగే మనలో ఉన్న పాపపు దుంప అంత లోతుల్లో ఉంటుంది. అది మనం తియ్యాలి కదా. అది మన ప్రయత్నం వల్ల, మన తెలివితేటల వల్ల సాధ్యంకాదు. ఒక దేవతాపురుషుడి అనుగ్రహం లేకుండా, గురువు దయలేకుండా ఆ దుంప బయటకురాదు. మన ప్రయత్నం మనం చెయ్యాలి. స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం ఉండాలి. మనం ప్రయత్నం చేస్తే సరిపోదు, కాలం కూడా కలిసిరావాలి. ఆఖరున ఈశ్వరుడి దయలేకుండా పాపపు దుంప

లోంచి మనం బయటకు రాలేము.

నేను రమణమహర్షిగారి పటం దగ్గర కూర్చున్నాను. ఆయనకు నేను ఎప్పుడూ పూజ చేయలేదు. ఆ పటం వంక చూస్తూ ఏమన్నాను అంటే ఇప్పుడు ఆ శరీరం లేదుకదా, నువ్వు లేవని నాకు తెలుసు అన్నాను. అంటే భగవాన్ అన్నారు నేను లేనని నువ్వు అనుకున్నా నీ వెంటపడుతున్న మాట నిజం అన్నారు. ఉండటానికి శరీరానికి సంబంధం ఏమిటి? బ్రాహ్మీస్థితి పొందినవాడు, వాడి శరీరం ఉన్నప్పుడు కూడా వాడు శరీరం కాదు. శరీరం ఉండటానికి లేకపోవటానికి జ్ఞానికి భేదం కనిపించదు. మిమ్మల్ని అందరినీ ఆ స్థాయికి తీసుకురావటానికే గురువు చేసే ప్రయత్నం. ఇవి కాలక్షేపం మాటలుకాదు. బ్రాహ్మీస్థితి పొందినవాడు కళ్ళు లేకుండా చూడగలడు, చెవులు లేకుండా వినగలడు, చేతులు లేకుండా పనిచేయగలడు, కాళ్ళు లేకుండా నడవగలడు మీరు ఇది గుర్తు పెట్టుకోండి. మనకి వచ్చే ఆలోచన, మనకి వచ్చే ప్రతీ తలంపు భగవంతుడు చూస్తున్నాడు. నా మాట మీరు వింటున్నారు ఆ మాట ఏ ప్రేరణ వల్ల వస్తుందో మీ కళ్ళకి కనపడదు, చెవులకి వినపడదు. కానీ ఆ ప్రేరణ భగవంతుడు చూస్తాడు, ఆయన సర్వసాక్షి అనే దృష్టి కనుక మీకు ఉంటే వెంటనే మీకు ధ్యానం చేసే బుద్ధి వచ్చేస్తుంది. ప్రతీది ఆయన అబ్జర్వు చేస్తున్నాడు అని మీరు భగవంతుడిని జ్ఞాపకం పెట్టుకుంటూ ఉంటే ధ్యానం తనంతట తానే మిమ్మల్ని వరిస్తుంది. ధ్యానం అనేది చేసేదికాదు, వచ్చేది.

మీరు గుడి చుట్టూరా ఏ భావనతోటి తిరిగి గుడిలోనికి వెళతారో అలాగే మీరు ఎవరికైనా మంచి చేసినప్పుడు కూడా అదే భావంతోటి మీరు చెయ్యాలి. మనం కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కాలరూపంలో ఉన్నవాడు భగవంతుడు. నువ్వు ఎవరివో నీకు తెలిస్తే జ్ఞానం, నువ్వు ఎవరివో నీకు తెలియకపోవటమే అజ్ఞానం. మీకు లోపల నుండి నేను, నేను అనే తలంపు వస్తోంది. అది ఎక్కడ నుంచి వస్తోందో మనకి తెలియాలి. కర్మ మార్గంలోకాని, విచారణామార్గంలోకాని, భక్తిమార్గంలో కాని నువ్వు అంత లోయల్లోకి దిగి ఈ నేను అనే తలంపు ఏ సోర్సులోంచి అయితే వస్తోందో ఆ సోర్సులోకి వెళ్ళి ఈ నేను అక్కడ ఐక్యమైతే అక్కడ నుంచి నీకు శాంతి తరంగాలు, జ్ఞానతరంగాలు వచ్చి నిన్ను ముంచేస్తాయి.

గీతలో ఏమని చెప్పాడంటే చనిపోయే రోజున రామనామమో, కృష్ణనామమో, శివ నామమో చేసుకోమన్నాడు. నువ్వు నామాన్ని స్మరించుకోవటం వలన రాముడిని దర్శించా వనుకో అంతమాత్రంచేత నీకు మోక్షంరాదు. ఆ నామాన్ని స్మరించటం వలన మీరు సాధన చేసుకోవటానికి అనుకూలమైన జన్మలు రావటానికి, అటువంటి కుటుంబాలలో పుట్టటానికి

నామాన్ని స్మరించుకోమని చెప్పాడు. అది వ్యవహారిక సత్యము. కానీ చనిపోయే రోజు వచ్చేటప్పటికి నువ్వు నూటికి నూరుపాళ్ళు ఆనందంలో, సుఖంలో, శాంతిలో ఊగిసలాడుతూ ఉంటే, శ్వాస బయటకిపోయే టైములో నీకు ఆనందం తప్పించి, శాంతి తప్పించి ఏమీ కనిపించకపోతే నీకు పునర్జన్మ లేదు. లోకంలో ఎక్కడా, ఏ వస్తువులోను ఆనందం లేదు, శాంతిలేదు, సుఖం లేదు. కానీ మనం ఎక్కడైతే ఆనందము లేదో, సుఖం లేదో అక్కడ సుఖం కోసం వెదుకుతున్నాము. వస్తువు ఎక్కడైతే లేదో అక్కడ నువ్వు వెదుకుతూ ఇలా మీరు కోటి జన్మలు ఎత్తినా అది మీకు దొరకదు. భగవంతుడు అక్కడ ఉన్నాను, ఇక్కడ ఉన్నాను అని చెప్పలేదు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని చెప్పాడు. వస్తువు ఎక్కడైతే ఉందో అక్కడ నువ్వు వెదికితే ఆ వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది.

పిల్లలకి పరీక్ష టైము ఎటువంటిదో, అలాగ సాధకులకి మరణటైము అటువంటిది. మరణటైములో మీ హృదయంలో సూక్ష్మరూపంలో ఉన్నటువంటి వాసనలు అన్నీ బ్రెయిన్‌లోకి వచ్చి పెద్దవిగా కనిపిస్తాయి. హృదయంలోంచి బ్రెయిన్‌లోకి, బ్రెయిన్‌లోంచి హృదయంలోకి అలా తిరుగుతూ ఉంటాయి. అలా తిరిగేటప్పుడు మీకు ఏ తలంపు అయితే బాగా ఇష్టమో, సడన్‌గా మనస్సు వెళ్ళి ఆ తలంపుని పట్టుకున్నాక నీ ముక్కులో గాలి బయటకు వచ్చేస్తుంది. ఆ తలంపుని బట్టి రీబర్త్ డిసైడ్ అయిపోతుంది. తరువాత నువ్వు శరీరం ఎక్కడ ధరించాలి అనేది నీ శరీరం చనిపోయే టైములోనే నిర్ణయం అయిపోతుంది. భగవద్గీత ఉపదేశ గ్రంథం. మీకు అర్థమయ్యే భాషలో చెప్పాడు. మేము చచ్చిపోతాం, చచ్చిపోతాం అనుకునే మిమ్మల్ని అమృతస్వరూపుల్ని చేయటానికి చెప్పిన గ్రంథం అది. వేదాల యొక్క సారం భగవద్గీత. వేదాలలో అవసరం లేని విషయాలు కూడా మనకి కనిపించవచ్చు. కానీ మనకి అవసరమైన విషయాలన్నీ సమన్వయం చేసి ఒక దండ కట్టినట్టు చెప్పాడు అది భగవద్గీత. భగవద్గీత అంటే భగవంతుడు చేత చెప్పబడినది. అర్జునా! ఎవరో వచ్చి నీకు సహాయం చేస్తారని ఎదురుచూడకు. నీ మనస్సుని, నీ ఇంద్రియాలని నీకు స్నేహితుడిగా, నీకు బంధువుగా మార్చుకో. నీ మనస్సు, నీ ఇంద్రియాలు నీ స్వాధీనంలో ఉంటే లోకంలో నీకు అందరూ శత్రువులు అయినా నిన్ను ఎవరూ ఏమీ చేయలేరు. నీ మనస్సు, నీ ఇంద్రియాలు నీ స్వాధీనములో లేకపోతే లోకంలో అందరూ నీకు అనుకూలంగా ఉన్నా వాళ్ళు నీకు ఏమీ ఉపకారం చేయలేరు. నీ మనస్సును శత్రువుగా మార్చుకోకు, నీ మనస్సుని మిత్రుడిగా మార్చుకో. నీ నిజమైన మిత్రుడు నీకు ఎంతసేవ చేస్తాడో అలాగ నీ ఇంద్రియాలు, నీ మనస్సు

నీకు అంత సేవ చెయ్యాలి అన్నాడు పరమాత్మ. మీరు హృదయంలో ఉన్న సుఖం పొందిన తరువాత దానికి అదే సాక్షి. ఈ సుఖానికంటే మించిన సుఖం, ఈ శాంతి కంటే మించిన శాంతి ఈ ప్రపంచంలో ఎక్కడా లేదు, ఇతర లోకాలలో కూడా లేదు. మీ శరీరం భూమి మీద తిరుగుతూ ఉండగానే అటువంటి ఆనందంలోకి, అట్టి సుఖంలోకి, అటువంటి జ్ఞానం యొక్క వైభవంలోనికి మిమ్మల్ని మేల్కొలపటానికి చెప్పబడిన శాస్త్రం ఈ భగవద్గీత.

జ్ఞానానంద, శివానంద వాళ్ళ జయంతులు ఎందుకు చేస్తున్నాం? అంటే వాళ్ళు అంత గొప్పవాళ్ళు, ఇంత గొప్పవాళ్ళు అని చెప్పటానికి కాదు. వాళ్ళని స్మరించుకోవటం వలన మనం పవిత్రులమవుతాము. జ్ఞానానంద రూపం మనకి జ్ఞాపకం వచ్చేకొలదీ మన రూపం లోంచి, మన నామంలోంచి బయటకి వస్తాము. మనల్ని ఎవరైనా గౌరవిస్తే ఒక రకంగా చూస్తాం, అగౌరవపరిస్తే ఒకరకంగా చూస్తాం. మనిషి అయ్యాక గౌరవాలు వస్తాయి, అగౌరవాలు వస్తాయి. మనం ఈ ద్వంద్వాల మధ్య తిరుగుతూ మన టైము అంతా వేస్టు చేసుకుంటూ ఏదో రోజున చనిపోతున్నాము. ఈ రకంగా మన జీవితాన్ని పాడుచేసు కుంటున్నాము. ఈ మానవ శరీరం మనకి భగవంతుడు ఇచ్చిన గిఫ్ట్. అందుచేత భగవంతుడు మనకి ఈ శరీరాన్ని ఇచ్చాడు, ఇంద్రియాలు ఇచ్చాడు, మనస్సు ఇచ్చాడు, నిర్ణయించుకోవటానికి బుద్ధిని ఇచ్చాడు. ఇవన్నీ మేగ్జిమమ్ మనం ఉపయోగించుకుని ట్రూత్‌ని రీలైజ్ చేయటానికి ప్రయత్నం చేయండి. ఓ అరుణాచలేశ్వరుడా ఏది సత్యమో, ఏది జ్ఞానమో తెలియకుండా నా శరీరాన్ని విడిచిపెట్టేస్తే ఈ జన్మ యొక్క ప్రయోజనం ఏమిటి? ఈ జన్మ దేనికి వచ్చినట్టు. తినటానికి, తిరగటానికా అన్నారు.

దేవతలకి దేవతలకి చుట్టరికాలు ఉంటాయి. మనుషులకీ, మనుషులకీ చుట్టరికాలు ఉంటాయి. కానీ మాకు సుబ్రహ్మణ్యుడికి చుట్టరికం ఉంది. ఆయన దేవతాపురుషుడు, మేము మానవులం. సాధారణంగా దేవతలకీ, మనుషులకీ చుట్టరికాలు ఉండవు. కానీ నాకు సుబ్రహ్మణ్యుడు గుర్తువచ్చినప్పుడు రెలిటివ్ అనిపిస్తుంది. ఆయన విగ్రహం ఎక్కడైనా చూచినప్పుడు నాకు నమస్కారం పెట్టాలనిపించదు. ఇష్టం లేక కాదు. ఇంట్లో వాళ్ళు ఇంట్లో వాళ్ళు ఏమి గౌరవించుకుంటారు. మనం కూడా ఆయన ఫ్యామిలీ మెంబర్ అనిపిస్తుంది. జన్మాంతరంలో సుబ్రహ్మణ్యుడికి మాకు అనుబంధం ఉంది. ఆయనకి మేము ఏ పూజ చేయం, నమస్కారం చేయం. కానీ హృదయంతోటి అనుబంధం కాదనలేము. హి ఈజ్ వెరీ క్లోజ్ టు మై హార్ట్.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

జనవరి 9 జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం, రమణ జయంతి



అరుణాచలంలో
వేగేశ్న వెంకటపతిరాజుగారు, వారి
ధర్మపత్ని కస్తూరి, కుటుంబ సభ్యులు
జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం

దిII 19-12-2011న
చిII వెంకట సత్యకృష్ణంరాజుకు
"నూతన ధోవతి ధారణ"
సందర్భముగా ఆశీర్వదిస్తున్న
సద్గురు శ్రీ నాన్నగారు





దిII 19-12-2011న
దాట్ల కృష్ణమూర్తిరాజుగారి మనుమడు
చిII వెంకట సత్యకృష్ణంరాజుకు
"నూతన ధోవతి ధారణ" సందర్భముగా
వారి కుటుంబ సభ్యులతో
సద్గురు శ్రీ నాన్నగారు

## ఏ రోజు జీవితం స్వప్నంగా గోచరిస్తుందో - ఆ రోజే చిత్తం శాంతిస్తుంది

మనకు చిన్న చిన్న వస్తువులు మారేవి, నశించేవి సత్యంగా ప్రాముఖ్యమైనవి, అమూల్యమైనవిగా కనిపిస్తాయి. అవి చేయి జారిపోతే ఏడుస్తూ ఉంటాము. ఏ మనిషి ఈ కనిపించే సృష్టిని సాక్షిగా చూస్తాడో ఆతడు ఉన్నత శిఖరాలను ఎక్కి సత్యాన్ని దర్శిస్తాడు. ఒక గంట అద్దంలా సాక్షిగా అయ్యే ప్రయోగం చేస్తే అతని జీవితం సత్యం వైపు మలుపుతిరుగుతుంది. జీవితం స్వప్నము నేను సాక్షిని అనే ప్రయోగం ఎప్పటివరకూ చెయ్యడో అప్పటివరకు సత్యాన్ని తెలుసుకోలేడు. రామనామంతో మాల తిప్పినా, గీత చదివినా తెలియదు సత్యం సాక్షీ ప్రయోగం మనకోసం మనం చెయ్యాలి. మన కొరకు ఇతరులు చెయ్యలేరు. ఈ జీవిత స్వప్నాలు ఎంత బలంగా ఉంటే అంతా మనం సత్యానికి దూరమౌతాము. వేదనకు గురి అవుతాము. ఈ స్వప్నాలను వివేక వైరాగ్యాలతో విడగొట్టాలి. కాని మనం వాటిని గట్టి పడేలా చేసుకొంటున్నాము. దీనికి ఆత్మ ఎరుకకావాలి. ఎవరు సత్యాన్ని శోధిస్తూ ఉంటారో వారు ధన్యులు. ఎవరు కనిపించే దానిమీద ఆగి దృశ్యం సమస్తం నిజమనుకొంటారో వారు భాగ్యహీనులు. సత్యజీవనంలో ప్రవేశించటానికి, అసత్యజీవనంలో మరణించాలి. దేవుడు మనకు పొరపాట్లను దిద్దుకొనే శక్తిని కూడా ఇచ్చాడు. మన అవగాహనాశక్తి పరిమితమైనది. మన ఇంద్రియాలు మనలను మోసం చేస్తూ ఉంటాయి. "ఈ సృష్టి అంతా భగవంతునితో అఛ్ఛదితమైయున్నదని" ఉపనిషత్తు చెబుతున్నది. ఇక దేన్ని గురించి మోహ పడతాము? ఈ స్వరూపాలు, కురూపాలు అన్ని మనమే అన్న నిశ్చయం కలగాలంటే గురువు యొక్క అనుగ్రహం కావాలి. ఆ బుద్ధి సూక్ష్మాన్ని గురువుదయతో మాత్రమే పరిష్కరిస్తుంది. కలలో దృశ్యాలు, ఎరుకలో దృశ్యాలకు విలువలేదు. అద్దాల గదిలో మనం ప్రవేసిస్తే అన్ని వైపులా మన రూపమే అలాగే జ్ఞానికి ఈ లోకమంతా తన రూపంగా భావిస్తాడు. మోహి వికారాలకు అవకాశం లేదు. ఆ స్థితిలో మనం మేల్కొనటానికి రోజు అంతా మన గురువు శ్రమిస్తారు దాన్ని మనం గుర్తించి కృతజ్ఞతతో, ప్రార్ధనా పూర్వకం, విశ్వాసభరితంగా నిరీక్షించాలి. శ్రీనాన్నగారు "మీరు వికారమైన తలంపులతో ఉంటే మీ గురువు బాధపడతాడు" అన్నారు. కాబట్టి మన సంకల్పబలంతో గురుశ్రమను నిర్వీర్యం చేసే దౌర్భాగ్యం తలంపులపై రాగ-ద్వేషాలపైనా మనం మరలకుండా మనవంతు కృషి మనం చెయ్యటం మన ధర్మం, కర్తవ్యం. దీనికి మించిన పని ఈ సృష్టిలో ఏదీ లేదు. కుటుంబ బాధ్యతలు మనం నిర్వర్తించాలి. నేను చేస్తున్నాను అనే భావం లేకుండా తామరాకు మీద నీటి బిందువులా దేనికీ అంటిపెట్టుకొని విలపించకుండా ఉండటమే సాక్షీ సాధన. భగవాన్ "యదార్ధంగా ఉన్నది ఆత్మస్వరూపం ఒక్కటే జగజ్జీవేశ్వరులు ముత్యపు చిప్పయందు వెండివలె అందుకల్పనామాత్రులే. ఈ మూడు ఒకేమారుతోచి ఒకేమారు అదృశ్యమౌతారు. నేను అనే తలంపు కించిత్తు లేని తానే స్వరూపము" అన్నారు. ఈ వాక్యాన్ని నిత్యం మన హృదయంలో పదిలపరచుకుంటే ఈ కల్పిత జీవితం జగత్ దృష్టివీడితే స్వరూప దర్శనమౌతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**